తన పుట్టిన రోజు సందర్భంగా బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను బుధవారం ఎర్రవల్లిలోని ఫాంహౌస్‌లో కలిసి ఆశీర్వాదం తీసుకుంటున్న బీఆర్ఎస్ఎల్‌పీ కార్యాలయ కార్యదర్శి మాదాడి రమేశ్‌కుమార్ రెడ్డి

26న పార్లమెంట్ ముట్టడి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య

కాచిగూడ, అక్టోబర్ 23: బీసీల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 26న వేలాది మంది బీసీలతో పార్లమెంట్‌ను ముట్టడిస్తామని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బీసీలకు సామాజిక న్యాయం చేయకపోతే కేంద్రంపై మిలిటెంట్ పోరాటం చేస్తామని ప్రకటించారు. జాతీయ బీసీ కన్వీనర్ గుజ్జ కృష్ణ ఆధ్వర్యంలో 13 బీసీ సంఘాలు, 30 కుల సంఘాల నాయకులతో బధవారం కాచిగూడ అభినందన్ హోటల్‌లో సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆర్.కృష్ణ య్య హాజరై మాట్లాడుతూ.. ఉవ్వెత్తున ఎగిసిన తెలంగాణ ఉద్యమంలాగా బీసీ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని పేర్కొన్నారు. కేంద్రం జనాభా దమాష ప్రకారం బీసీలకు రిజర్వేన్లు కల్పించాలని, అందుకు పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణ చేయాలన్నారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టి అసెంబ్లీ, చట్ట సభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. వికసిత్ భారత్ అంటే అంబానీ, ఆధానీ కాదని, దేశంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీలైన బహుజనులను బాగుచేయడమని సూచించారు.ఈ కార్యక్రమంలో నంద గోపాల్, ఉదయ్, నీల వెంకటేశ్, రాఘవ, రఘుపతి, మోడి రాందేవ్, రవియాదవ్, నిఖిల్, దేవేందర్, బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

రూ.30లక్షలతో ముత్యాలమ్మ ఆలయ పునరుద్ధరణ పనులు

దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్

మారేడ్‌పల్లి, అక్టోబర్ 23: సికింద్రాబాద్, కుమ్మరిగూడలోని ముత్యాలమ్మ ఆలయం పునరుద్ధరణ పనులను రూ. 30 లక్షల వ్యయంతో చేపట్టనున్నట్లు దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్ అన్నారు. బుధవారం ఆమె.. దేవాలయాన్ని సందర్శించి ఘటన గురించి డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్, ఫౌండర్ ఫ్యామిలీ సభ్యులతో మాట్లాడారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... దేవాలయానికి అవసరమైన మరమ్మతులతోపాటు పంచలోహాలతో అమ్మవారి విగ్రహాన్ని తయారు చేయిస్తున్నామని, ఈ విగ్రహాన్ని ఉత్తరాయణం రావడానికి ముందే ప్రతిష్ఠిస్తామని ,అవసరమైతే చండీ యాగాన్ని కూడా చేపడుతామని తెలిపారు. ప్రజలందరూ శాంతియుతంగా ఉండి సహకరించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

ఓయూ వీసీని కలిసిన ఎన్ఆర్ఐ బృందం

కార్వాన్, అక్టోబర్ 23: ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌గా బాధ్యతలు చేపట్టిన కుమార్ ములుగరంను బుధవారం గవర్నర్ స్టేట్ యూనివర్సిటీ, ఇల్లినాయిస్ స్టేట్ ఆఫ్ అమెరికా కాలేజి ఎన్ఆర్ఐ బృందం కలిసి సన్మానించింది. వీసీని కలిసిన వారిలో డాక్టర్ రాబర్ట్ మోర్ల్(డైరెక్టర్ ఆఫ్ ఇంటర్నేషనల్ సర్వీసెస్), డాక్టర్ సోనియా దాల్మియా (డీన్ కాలేజ్ ఆఫ్ బిజినెస్), జేసన్ (డైరెక్టర్ ఆఫ్ గ్రాడ్యుయేషన్ అడ్మిషన్), పి. లక్ష్మీనారాయణ (ఓయూ రిజిస్ట్రార్), ఎం.రాములు(కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్)లతో పాటు తెలంగాణ కురుమ యువత అధ్యక్షుడు తూంకుంట అరుణ్ కుమార్ ఉన్నారు.

గిరిజనుల హామీలు అమలు చేయాలి

తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్యనాయక్

హిమాయత్‌నగర్,అక్టోబర్ 23: రాష్ట్రంలోని గిరిజనులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. అంజయ్యనాయక్ డిమాండ్ చేశారు. బుధవారం హిమాయత్‌నగర్‌లోని మఖ్దుం భవన్‌లో సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 నెలలు గడిచినా గిరిజనుల సమస్యలను పరిష్కరించడంలో సవతితల్లి ప్రేమ చూపిస్తుందన్నారు. ఆదివాసీ గిరిజనులపై నిత్యం ఏదో ఒక ప్రాంతంలో దాడులు, అఘాయిత్యాలు జరుగుతూనే ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గిరిజనుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 29న అన్ని కలెక్టరేట్ల కార్యాలయాల ఎదుట జరిగే నిరసన కార్యక్రమానికి గిరిజనులు అధిక సంఖ్యలో తరలిరావాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సమాఖ్య నేతలు అజ్మీర రామ్మూర్తి, కుటుంబరావు, భూక్యశ్రీను, ఆర్.శంకర్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

మోటకొండూర్ మార్కెట్ కమిటీని తక్షణమే ప్రకటించాలి

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కృష్ణ

మోటకొండూర్, అక్టోబర్ 24 : జీఓ 43 ప్రకారం మోటకొండూర్ మార్కెట్ కమిటీని తక్షణమే ప్రకటించాలని బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి ఎగ్గిడి కృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని మార్కెట్ యార్డు వద్ద గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2023లో వచ్చిన జీఓ 43 ప్రకారం మోటకొండూర్ మార్కెట్ కమిటీ ఎన్నికైందని, ఆ మార్కెట్ కమిటీని ఏర్పాటు చేయకపోవడం సరికాదని అన్నారు. మోత్కూరు పరిధిలోని రైతులకు ఆలేరు కమిటీలో ఎలా చోటిస్తారని ప్రశ్నించారు. ఆలేరు మార్కెట్ కమిటీని రద్దు చేయాలని, మోటకొండూర్ మార్కెట్ కమిటీ కేటాయించి, తక్షణమే నూతన కమిటీని ఎన్నుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ కో ఆప్షన్ సభ్యుడు బురాన్, నాయకులు దడిగె మధు, గంధమల్ల మధు, ఉప్పలయ్య, శ్రీశైలం, బొట్ల ప్రశాంత్, నరేశ్, రాజు ఉన్నారు.

'29న మాదిగల ధర్మ యుద్ధ సదస్సును జయప్రదం చేయండి'

అభివాదం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 24 : భువనగిరిలో ఈ నెల 29న నిర్వహించే మాదిగల ధర్మ యుద్ధ ఉమ్మడి నల్లగొండ జిల్లా సదస్సుకు మాదిగలు తరలివచ్చి జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు దుబ్బ రామకృష్ణ మాదిగ అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, అనుబంధ సంఘాల నియోజకవర్గస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణలో వర్గీకరణను అమలు చేస్తామని దేశంలోనే మొదటిసారిగా ప్రకటించారన్నారు. ఏ నోటిఫికేషన్ వచ్చినా వర్గీకరణ అమలు చేస్తామని అసెంబ్లీలో హామీ ఇచ్చి రెండు నెలలు తిరుగకముందే మాట మార్చి మాదిగలకు ద్రోహం చేశారని విమర్శించారు. రాష్ట్రంలో మాల ప్రజాప్రతినిధులకు తలొగ్గి మాదిగలకు ద్రోహం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎదుర్కోవడానికి ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నాయకులు మరో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నల్ల చంద్రస్వామి, నాయకులు రేణుక, దేవేందర్, సుధాకర్, దాస్, శ్రీను, శంకర్, భిక్షపతి, కుమార్, చంద్రయ్య, శివశంకర్, లింగస్వామి, నర్సింహ, స్వామి, రమేశ్ పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి – పశు వైద్యాధికారి యాకూబ్

గుండాల, అక్టోబర్ 24 : రైతులు తమ పశువులకు గాలికుంటు నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని పశు వైద్యాధికారి యాకూబ్ అన్నారు. మండలంలోని గంగాపురం గ్రామంలో గురువారం 250 పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల్లో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పాల సంఘం చైర్మన్ ఎండీ అలీం, వీఏ ప్రవీణ్, గోపాలమిత్రలు గోవిందు, కిష్టయ్య, సోమశేఖర్, రైతులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

చౌటుప్పల్, అక్టోబర్ 24 : మహిళలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలోపేతం కావాలని మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెం గ్రామ స్టేజీ వద్ద మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటిన్‌ను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బండమీది మల్లేశం, కొయ్యాడ సైదులుగౌడ్, ఉబ్బు వరమ్మ, మెప్మా టీఎంసీ బి.కవిత పాల్గొన్నారు.

బాల్యమిత్రుడి కుటుంబానికి బాసటగా..

ఆలేరు టౌన్, అక్టోబర్ 24 : పట్టణానికి చెందిన తాటికాయల సురేందర్ ఇటీవల మృతి చెందాడు. ఆయన కుటుంబానికి సరేందర్ బాల్య మిత్రులు బాసటగా నిలిచారు. గురువారం సరేందర్ కుటుంబాన్ని పరామర్శించి రూ.51,500 ఆర్థిక సాయం అందజేసి మనోధైర్యం కల్పించారు. కార్యక్రమంలో సుదగాని సాగర్, పగడాల శ్రీనివాస్, ఇక్కిరి శ్రీనివాస్, జూకంటి సిద్ధులు, దూడల ప్రవీణ్, కామిటికారి సిద్ధులు, గ్యార కుమార్, ఎలగల భాస్కర్, శ్రీను ఉన్నారు.

గుండెపోటుతో భక్తుడు మృతి

యాదగిరిగుట్ట, అక్టోబర్ 24 : యాదగిరిగుట్ట లక్ష్మీనర్సింహస్వామి దర్శనానికి వచ్చిన ఓ భక్తుడు తిరిగి వెళ్లే క్రమంలో అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో మృతి చెందాడు. రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం మేకగూడ గ్రామానికి చెందిన దేశపాక పోశయ్య(65) తన కుటుంబ సభ్యులతో గురువారం స్వామివారిని దర్శించుకునేందుకు కొండపైకి వచ్చాడు. దర్శనానంతరం తిరుగు ప్రయాణంలో కమాన్ వద్దకు రాగానే చాతినొప్పితోపాటు ఫిట్స్ వచ్చాయి. దీంతో అప్రమత్తమైన దేవస్థాన సిబ్బంది బ్యాటరీ వాహనంలో యాదగిరిగుట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు.

క్షయ వ్యాధిపై అవగాహన

ఆలేరు రూరల్, అక్టోబర్ 24 : మండలంలోని కొల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బ్యాక్‌టు బ్యాక్ మరియు లివింగ్ బ్రేడ్ సొసైటీ ఆధ్వర్యంలో క్షయ వ్యాధిపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ అభిలాష, డాక్టర్ దేవసహాయం, పంచాయతీ కార్యదర్శి సాయిలు, ఏఎన్ఎం జయమ్మ, కారోబార్ రమేశ్ పాల్గొన్నారు.

పోచంపల్లి - కొత్తగూడెం రహదారిలో దొంగల భయం

భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 24 : పోచంపల్లి – కొత్తగూడెం రహదారిలో వాహనదారులు, ప్రయాణికులకు దొంగల భయం పట్టుకుంది. మున్సిపాలిటీకి చెందిన బండారు బన్నీ చౌటుప్పల్ మండలంలో సెంట్రింగ్ పని ముగించుకుని బుధవారం రాత్రి ఇంటికి బైక్‌పై వస్తున్నాడు. కొత్తగూడెం నుంచి పోచంపల్లికి వస్తుండగా గుర్తుతెలియని నలుగురు వెంబడించారు. అతను వారి నుంచి తప్పించుకొని తన స్నేహితులు, గ్రామస్తులతో కలిసి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోచంపల్లి – కొత్తగూడెం మార్గంలో దొంగల బెడద ఎక్కువైందని, పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించాలని నాయకులు చింతకింది కిరణ్, గుండు ప్రవీణ్, పరమేశ్ కోరారు. దొంగలను పట్టుకునేందుకు తగిన చర్యలు చేపడుతామని ఎస్ఐ కంచర్ల భాస్కర్‌రెడ్డి తెలిపారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలి

- విద్యారంగ సమస్యలు పట్టని ప్రభుత్వం
- 27లోపు విడుదల చేయకపోతే హైదరాబాద్ దిగ్బంధనం
- ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన, నిరసన

మేడ్చల్ కలెక్టరేట్, అక్టోబర్ 23 : పెండింగ్ ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం చలో కలెక్టరేట్ కార్యాలయం పేరుతో ఆందోళన కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని ఆరోపించారు. అధికారం చేపట్టి 10 నెలలు కావస్తున్నా విద్యారంగ సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపునకు రూ.8వేల కోట్లను వెంటనే విడుదల చేయాల న్నారు. మూడేళ్ల నుంచి బకాయిలు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు కోర్సులు పూర్తి చేసినా కళాశాల యాజమాన్యాలు ధ్రువ పత్రాలను విడుదల చేయడం లేదని తెలిపారు. దీంతో వారు పై చదువులకు వెళ్లలేక, ఉద్యోగాలు చేసుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ నెల 27లోపు నిధులు విడుదల చేయకపోతే వేలాదిమంది విద్యార్థులతో హైదరాబాద్‌ను దిగ్బంధనం చేస్తామని ఆయన హెచ్చరించారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ విజయేందర్ రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రహ్మాన్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చిన్న, అన్వర్, నాయకులు హరీశ్, అరవింద్, శశిధర్, మహేశ్, దుర్గారావు, సమీర్, విద్యార్థులు పాల్గొన్నారు

మేడ్చల్ కలెక్టరేట్ వద్ద ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తున్న విద్యార్థులు

నిర్లక్ష్యం తగదు..

సుల్తాన్‌బజార్: రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు చైతన్య యాదవ్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా హైదరాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ప్లకార్డులు ప్రదర్శిస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ..ఏఐఎస్ఎఫ్ ఓయూ అధ్యక్షుడు లెనిన్‌తో కలిసి మాట్లాడుతూ.. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్ బకాయిలు విడుదల చేయడానికి నిధులు ఇవ్వకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే విద్యార్థులు విద్యాభ్యాసం ఎట్లా అని ప్రశ్నించారు. ఫీజు బకాయిల విడుదలపై ప్రభుత్వం చేస్తున్న జాప్యం సరికాదని అన్నారు. ఈ సందర్భంగా ధర్నా చేస్తున్న నాయకులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి బండ్లగూడ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.ఈ కార్యక్రమంలో అరెకంటి భగత్, కాంపల్లి కళ్యాణ్, అశ్విన్, ఉదయ్, పవన్, జ్ఞానేశ్వర్, ప్రవీణ్, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐఎస్ఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు చైతన్య యాదవ్, తదితరులు

విద్యార్థుల జీవితాలతో చెలగాటమా..!

మన్సూరాబాద్: ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నారని ఏఐవైఎఫ్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పి. శివకుమార్‌గౌడ్ తెలిపారు. పెండింగ్‌లో ఉన్న రూ. 7700 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, ఉపకార వేతనాలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ బుధవారం ఏఐవైఎఫ్ రంగారెడ్డి జిల్లా సమితి ఆధ్వర్యంలో ఎల్బీనగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా శివకుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రవేశపెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వమే.. ఇప్పుడు ఈ పథకానికి తూట్లు పొడుస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు టి.మధు, ఆఫీస్ బేరర్స్ వెంకటేశ్, శివ, వీరేశ్, నాయకులు సంజీవ, నాగరాజు, గణేశ్, భానుప్రకాశ్, గండికోట శివ, మోహన్, బాబు, వెంకటేశ్, చిరంజీవి, సీహెచ్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ప్రేమకు పరాకాష్ఠ నాటిక

రవీంద్రభారతి,అక్టోబర్ 23: తెలంగాణ ప్రభుత్వం ,భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో రవి అండ్ రవి ఆర్ట్స్ అసోసియేషన్ 66వ వార్షికోత్సవం సంద ర్భంగా ప్రముఖ రంగస్థల నటుడు, రచయిత, నటుడు దర్శకుడు ,నిర్వాహకుడు ,కార్యదర్శి రక్తకన్నీరు నాగభూషణం బిరుదు గ్రహిత జి.మాడుగుల కృష్ణమోహన్ రచించి, నటించి, దర్శకత్వం వహించిన 275వ 'ప్రేమకు పరాకాష్ట' నాటికను రవీంద్రభారతిలోని కాన్ఫరెన్స్‌లో బుధవారం ప్రదర్శించారు.ఈ నాటికలో కళాకారులు ప్రధాన పాత్రలో మాడుగల కృష్ణమోహన్, కథానాయిక పాత్రలో ప్రముఖ నటిమణి జి.మనుప్రియ, సహజ నటి చంద్రకళ, చలాకి తార , మధుప్రియ ప్రమీళ పాత్రలో అత్యద్భుతంగా నటించారు. టీవీ నటుడు ఐరేని రమేశ్‌గౌడ్, జి.గోవింద్ సత్యనారాయణ, ఎంవీఎస్ ఫణిందర్ పాల్గొన్నారు.

టీచర్ ఉద్యోగం సాధించిన కానిస్టేబుల్‌కు సన్మానం

ఆత్మకూరు(ఎం), అక్టోబర్ 24 : స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న సూర్యాపేట జిల్లాకు చెందిన ఎం.రేణుక ఇటీవల ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం సాధించింది. కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ ఉపాధ్యాయురాలిగా ఎంపికై గురువారం స్టేషన్ నుంచి రిలీవ్ అయ్యింది. ఈ సందర్భంగా రేణుకను పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ సోలోమాన్‌రాజ్, ఎస్ఐ కృష్ణయ్య సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ సైదులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వచ్చే నెల 3న సీపీఎం మండల మహాసభ

బీబీనగర్, అక్టోబర్ 24 : మండల కేంద్రంలోని షాదీఖానలో నవంబర్ 3న నిర్వహించే సీపీఎం మండల 8వ మహాసభలను విజయవంతం చేయాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కోమటిరెడ్డి చంద్రారెడ్డి పార్టీ సభ్యులకు పిలుపునిచ్చారు. పార్టీ కార్యాలయంలో గురువారం మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. మూడేండ్ల కాలంలో సీపీఎం చేసిన ఆందోళనలు, పోరాటాలను ఈ మహాసభల్లో చర్చించి భవిష్యత్ కర్తవ్యాలను రూపొందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి గాడి శ్రీనివాస్, నాయకులు కందాడి దేవేందర్‌రెడ్డి, ఓవల్దాసు సతీశ్, హరికృష్ణ, శ్రవణ్ పాల్గొన్నారు.

స్వదేశీ మేళా ప్రారంభం

ఖైరతాబాద్, అక్టోబర్ 23 : స్వదేశీ జాగరణ మంచ్, స్వావలంబి భారత అభియాన్ సంయుక్తాధ్వర్యంలో నెక్లెస్‌రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన స్వదేశీ మేళాను రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ బుధవారం సాయంత్రం ప్రారంభించారు. స్వదేశీ ఉత్పత్తులు, చేనేత, చేతివృత్తులు, ఆర్గానిక్ వస్తువులతో సుమారు 334 స్టాళ్లను ఏర్పాటు చేయగా, గవర్నర్ వాటిని సందర్శించారు.

ముగిసిన కోదాటి శత జయంతి నాటకోత్సవాలు

తెలుగు యూనివర్సిటీ, అక్టోబర్ 23: తెలంగాణ నాటక సమాజాల సమాఖ్య ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో జరుగుతున్న తెలంగాణ తొలి మాండలిక నాటక రచయిత కోదాటి లక్ష్మీనరసింహారావు శత జయంతి నాటకోత్సవాలు బుధవారంతో ముగిసాయి. విశ్రాంత డీజీపీ హెచ్.జె దొర పాల్గొని తెలంగాణ మాండలిక పదాలకు నాటక రచనలో ప్రాచుర్యం కలిపించిన కోదాటి లక్ష్మీ నరసిం హారావు కృషిని ప్రశంసించారు. ఈ సందర్భంగా కళా నికేతన్ సమర్పణలో కె.ఎల్ నరసింహారావు రచించిన స్వార్థం నాటికను దర్శకుడు డాక్టర్ గోవాడ వెంకట్ దర్శకత్వంలో అద్భుతంగా వేదికపై ప్రదర్శించి నాటక ప్రియుల మన్ననలు అందుకున్నారు.

ప్రభుత్వంలో విలీనం డేట్‌ను ప్రకటించాలి

టీజేఎంయూ వ్యవస్థాపక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హనుమంతు

చిక్కడపల్లి, అక్టోబర్ 23 : ఆర్‌టీసీ ఉద్యోగులకు ప్రభుత్వంలో విలీన డేట్‌ను వెంటనే ప్రకటించాలని ,ఆర్టీసీ యూనియన్లను అనుమతించాలని తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్(టీజేఎంయూ) వ్యవస్థాపక రాష్ట్ర ప్రధాన కార్యద ర్శి కె.హనుమంతు ముదిరాజ్ డిమాండ్ చేశారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో టీజేఎంయూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నూతన కమిటీని నియమించారు. అధ్యక్షుడిగా డి.వి.కె. రావు, వర్కింగ్ ప్రసిడెంట్‌గా స్వాములయ్య, చీఫ్ వైస్ ప్రెసిడెంట్‌గా పి.శ్రీరాములు, ప్రధాన కార్యదర్శిగా కె.హనుమంతు ముదిరాజ్, ఉపాధ్యక్షులుగా గోలీ రవీందర్, వెంకటేశ్వర్లు, సంయుక్త కార్యదర్శిగా పీకే మూర్తి , తదితరులు నియమితులయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్ష,ప్రధాన కార్యర్యులు మాట్లాడుతూ ..2021,22 వేతన సరణ వెంటనే చేయాలని అన్నారు. కార్మికులపై పెంచిన పనిభారాన్ని తగ్గించాలని అన్నారు. యూనియన్లు అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కుప్పకూలిన నాలా పైకప్పు..

గోషామహల్ దారుస్సలాం రోడ్డులోని చాక్నావాడి ప్రధాన రహదారిపై ఉన్న నాలా పై కప్ప ఒక్కసారిగా కుప్పకూలింది. అయితే ఆ సమయంలో జన సంచారం, వాహనాలు లేకపోవడంతో అదృష్టవశాత్తు ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. -కార్వాన్, అక్టోబర్ 23